# ఎడాపెడా భూసేకరణ!

## ప్రజలు ఉద్యమిస్తున్నా రేవంత్ సర్కారు వరుస నోటిఫికేషన్లు ● తాజాగా నిమ్జ్ కోసం 1,456 ఎకరాల సేకరణకు ఉత్తర్వులు



హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ) : భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు, విద్యార్థులు ఉద్యమిస్తున్నా రేవంత్ సర్కారు మాత్రం వరుస నోటిఫికేషన్లతో బాధితుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. ఇప్పటికే లగచర్ల, హెచ్‌సీయూతోపాటు పలు ప్రాంతాల్లో భూసేకరణకు వ్యతిరేకంగా ఉద్యమించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా నోటిఫికేషన్ల జారీ చేస్తున్నది. తాజాగా నిమ్జ్(నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్)కోసం సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలో 1,456 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. గుంజేటి గ్రామంలో 59 మంది రైతుల నుంచి 286.13ఎకరాలు, మామిడ్గి గ్రామంలో 694 మంది నుంచి 1169.11ఎకరాలు, గణేశ్‌పూర్‌లో 1.06 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇదివరకే రైతుల అభిప్రాయాల సేకరణ పూర్తయిందని, ఇంకా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. ఇటీవలే ప్రభుత్వం న్యాల్కల్ మండలం హుసెల్లి గ్రామ పరిధిలో 491 మంది రైతుల నుంచి 653.08 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా, తాజా నోటిఫికేషన్‌తో ఒక్క న్యాల్కల్ మండలంలోనే 2109.38 ఎకరాల భూసేకరణకు చర్యలు తీసుకున్నట్టు అయ్యింది.

**ప్రభుత్వ చర్యలతో ధరలు తగ్గుముఖం..**

వాస్తవానికి మొదటి నుంచీ రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం బలవంతంగా నోటిఫికేషన్లు జారీచేస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిమ్జ్ కోసం భూములు సేకరిస్తున్నారనే కారణంతో ఈ ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు భూములు కొనేందుకు ముందుకు రావడంలేదని వారంటున్నారు. దీంతో అనివార్యంగా ప్రభుత్వానికి భూములు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొన్నట్టు పేర్కొంటున్నారు. మరోవైపు గతంలో రూ.4 లక్షల నష్టపరిహారం తీసుకొని భూములు ఇచ్చినవారు సైతం ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారికి ప్రస్తుత ధరల ప్రకారం నష్టపరిహారం మంజూరవుతున్నట్టు స్థానిక రైతులు చెప్తున్నారు. గత మూడేండ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా గరిష్ఠ ధరను పరిగణలోకి తీసుకొని నష్టపరిహారాన్ని ఖరారు చేస్తున్నారని, ఫలితంగా ఎకరానికి రూ.15 లక్షల వరకు పరిహారం వస్తున్నదని పేర్కొంటున్నారు. వాస్తవానికి జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ పరిధిలో లేని ప్రాంతంలో భూముల ధరలు ఎకరాకు రూ.50 లక్షల వరకు పలుకుతున్నప్పటికీ తాము రూ.15లక్షలతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నదని కొందరు రైతులు వాపోతున్నారు.

**భూముల కేటాయింపులో టీజీఐఐసీ ఉదాసీనత**

జహీరాబాద్ నిమ్జ్ కోసం జహీరాబాద్, న్యాల్కల్, జరాసంఘం మండలాల పరిధిలో సుమారు 13,500 ఎకరాలు సేకరించానే ప్రతిపాదన ఉండగా, ఇందులో దాదాపు 8 వేల ఎకరాల పైచిలుకు భూముల సేకరణ గతంలోనే పూర్తయింది. మిగిలినచోట్ల కోర్టు కేసులు, రైతుల వ్యతిరేకత, ప్రజాభిప్రాయ సేకరణ తదితర కారణాలతో భూసేకరణ నిలిచిపోయింది. దాదాపు 3వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ టీజీఐఐసీ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలున్నాయి.

---

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు!

మొదటిపేజీ తరువాయి...



పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగా లేదని, ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థను గట్టెక్కిస్తున్నామని, ఆర్టీసీ లాభాలబాటలో పయనిస్తున్నదని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయ ప్రేరేపితంతో సమ్మె బాట పడితే మొత్తం ఆర్టీసీ సంస్థనే దెబ్బతింటుందని హెచ్చరించారు. ఆర్టీసీలో ఏదైనా సమస్య ఉంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించాలని, ప్రభుత్వం చేయగలిగింది చేస్తుందని చెప్పారు. కార్మిక సంఘాల నాయకులకు నా విజ్ఞప్తి ఒక్కటే, రాష్ట్రానికి వచ్చే ఆదాయ లెక్కలన్నీ మీ ముందే ఉంచుతా.. ఏ పథకం ఆపాలో.. ఏ పథకం ఆపకూడదో మీరే చెప్పండి అని కోరారు. ఇంకో సంవత్సరం అయితే కుదురుకుంటామని చెప్పారు. నా మాట నమ్మాలని, కార్మికులకు ఇచ్చిన మాటను నెరవేరుస్తానని చెప్పుకొచ్చారు. అనంతరం కార్మికులకు శ్రమశక్తి అవార్డులను ప్రదానం చేశారు.

---

# అందాల పోటీలకు రూ.200 కోట్లు

- భారీ ఏర్పాట్లకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ భరించేలా ప్రణాళికలు
- పది ప్రాంతాల్లో నిర్వహణకు వేదికల ఎంపిక, ఏర్పాట్లు
- అంత ఖర్చు లేదని చెప్పకొస్తున్న సీఎం, మంత్రులు
- పెట్టుబడుల కోసమే పోటీ అంటూ బుకాయింపులు
- అందాల పోటీలతో ఒరిగేదేంటని జనం నిలదీత




హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ప్రపంచ అందాల పోటీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఖర్చుకు సిద్ధమైందని తెలుస్తున్నది. భారీ వేదికలు, ఏర్పాట్ల కోసం దాదాపు రూ.200 కోట్లను వెచ్చించనున్నట్టు సమాచారం. ఈ మొత్తాన్ని సాంస్కృతిక, పర్యాటకశాఖలు, జీహెచ్‌ఎంసీలు భరించేలా ప్ర ణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఓ వైపు ఖజానా ఖాళీ అయిందని చెప్తున్న ప్ర భుత్వ పెద్దలు.. మరోవైపు అందాల పో టీలు ఆర్భాటంగా నిర్వహించాల్సిన అవసరమేంటని ప్రతిపక్షపార్టీలతోపాటు పలు ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

**పోటీలు.. ఎప్పుడు.. ఎక్కడ.. ఎందుకు?**

హైదరాబాద్ వేదికగా ఈ నెల 10 నుంచి నుంచి 31 వరకు 72వ ప్రపంచ అందాల పోటీలు జరుగుతాయని మిస్ వరల్డ్ సంస్థ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల నుంచి యువతులు పోటీల్లో పాల్గొంటారని తెలిపింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభ వేడుకలు, హైటెక్స్‌లో ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామని సంస్థ సీఈవో వెల్లడించారు. మరోవైపు ప్రభుత్వం రాష్ట్రంలోని 10 వేదికలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైటెక్స్, శిల్పారామం, గచ్చిబౌలి స్టేడియం, పోచంపల్లి, యాదగిరిగుట్ట, రామప్ప, లక్నవరం, నాగార్జునసాగర్, వికారాబాద్ ప్రాంతాలను ఎంపిక చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అందాల పోటీలు నిర్వహిస్తే ఆయా ప్రదేశాల్లో పర్యాటక అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ పెద్దలు చెప్తున్నారు.

**ప్రశ్న పెట్టుబడుల ఆకర్షణే ఆన్సరా?**

అందాల పోటీలతో కూడా పెట్టుబడులు ఆకర్షిస్తామని ప్రభుత్వం చెప్పడంపై విపక్షాల నేతలు, ప్రజలు నిలదీస్తున్నారు. అందాల పోటీలతో పెట్టుబడులు ఎలా ఆకర్షిస్తారని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పోచంపల్లి చీరలను అందాల పోటీల్లో పాల్గొనే యువతులు ధరిస్తే ఆ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందుతాయని ప్రభుత్వ పెద్దలు వివరిస్తున్నారు. కానీ ప్రపంచ ఖ్యాతి పొందిన పోచంపల్లి చీరలకు అందాల పోటీలతో అదనంగా కలిగే ప్రాచుర్యం ఏమిటని సాంస్కృతికరంగ ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వం ఆర్భాటం కోసం, జేబులు నింపుకోవడం కోసం చేస్తున్న ఎత్తుగడ అని ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ము ఖ్యంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ సమస్యలు కాదని అందాల పోటీలకు ప్రాధాన్యత ఇవ్వడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

### పోటీల వల్ల రాష్ట్రానికి ఒరిగేదేంటి..?

మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల అభివృద్ధికి వేదికగా మలుచుకుంటామని పర్యాటకశాఖ ప్రకటించింది. అందాల పోటీల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, పర్యాటకులను ఆకర్షించేందుకు ఉపయోగపడుతాయని వెల్లడించింది. కానీ ప్రభుత్వం చెప్తున్న కారణాలు, వివరణలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం ఖర్చును భరించి ఏర్పాటు చేసుకోవాల్సిన భారత్ సమ్మిట్-2025 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో రూ.30కోట్లు ఖర్చు పెట్టి నిర్వహించింది. పార్టీ కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు వెచ్చించడమేంటని విపక్షాలు, ప్రజలు ప్రశ్నించారు. భారత్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. కానీ సమ్మిట్ ద్వారా ఎన్ని రూపాయల పెట్టుబడులు వచ్చాయనేది ప్రకటించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

---

# కేంద్రంతో కలిసి పనిచేస్తాం

- కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తాం
- ఏడాదిలోపు కులగణనను పూర్తిచేయాలి : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): కులగణనపై కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జనగణనతోపాటు కులగణన చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పారదర్శకంగా పూర్తిచేసిన కులగణన దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఈ విధానాన్ని కేంద్రం రోల్‌మోడల్‌గా తీసుకోవాలని సూచించారు. కులగణనపై మంత్రులతో, అధికారులతో వేర్వేరు కమిటీలు వేసి రాష్ట్రాల అభిప్రాయాలతోపాటు అన్నివర్గాల అభిప్రాయాలను సేకరించాలని కోరారు. విధి విధానాలను కూడా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కులగణనను ఏడాదిలోపు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమికి 400 సీట్లు వచ్చుంటే రాజ్యాంగాన్ని మార్చేసేదని, కులగణన ప్రస్తావనే ఉండేదికాదని తెలిపారు.

### స్థానిక ఎన్నికలపై సీఎం దాటవేత

- 42శాతం కోటా అమలుపై సమాధానానికి నిరాకరణ

స్థానిక ఎన్నికలకు, కులగణనకు సంబంధమే లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. కులగణన చేపట్టనున్నట్టు కేంద్రం నిర్ణయించడంతో తెలంగాణలో చేసిన కులగణన పరిస్థితి ఏమిటని, దీని ద్వారా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారా? అని సీఎంను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పేందుకు నిరాకరించారు. ఇప్పుడు ఆ ప్రశ్నతో సంబంధమే లేదని దాటవేశారు. కులగణనకు, ఎన్నికలకు సంబంధం లేదని చెప్పారు.

## 42వసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ఇది 42వ సారి. శుక్రవారం సాయంత్రం జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ఆయన హాజరవుతారని సీఎంవో ప్రకటించింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, వివిధ రాష్ట్రాలను చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారు. కుల గణనపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్టు సమాచారం.

---

## తెలంగాణ బీసీ బిల్లులను ఆమోదించండి

**కేంద్రానికి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ విజ్ఞప్తి**



హైదరాబాద్, మే1 (నమస్తే తెలంగాణ): బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ తెలంగాణ సర్కారు చేసిన బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనాభా గణనతోపాటు కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే కులగణన నిర్వహించి.. బీసీలకు స్థానికసంస్థలు, విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్‌ను కల్పిస్తూ బిల్లులను చేసిందని వివరించారు. జాతీయస్థాయిలో కులగణన జరిగే వరకూ ఆ బిల్లులను ఆపొద్దని, తెలంగాణను ఒక స్పెషల్ కేసుగా పరిగణించి బిల్లులకు చట్టరూపం కల్పించాలని కోరారు.ఈ విషయంలో చొరవచూపాలని నిరంజన్ సూచించారు.

**బీసీల పోరాట ఫలితమే కులగణన**

దశాబ్దాలుగా ఓబీసీలు చేస్తున్న అలుపెరగని పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి కులగణనకు అంగీకరించిందని, ఇది ఓబీసీల విజయమని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగాల్లో బీసీల రిజర్వేషన్‌ను పెంచాలని, చట్టసభల్లోనూ రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

## మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు మోక్షమెన్నడు?

- వైద్యశాఖలో 4 నెలలుగా ఉద్యోగుల ఎదురుచూపులు
- నిరుడు డిసెంబర్ 31న దరఖాస్తుల ప్రక్రియ పూర్తి
- జాప్యంతో ఉద్యోగుల్లో ఆందోళన

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ ముందుకు సాగడంలేదు. నాలుగునెలల క్రితమే దరఖాస్తుల ప్రక్రియ ముగిసినా ప్రభుత్వంలో చలనం లేదు. ఫలితంగా ఆ శాఖలో పనిచేసే 150 మంది ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. రాష్ట్రవ్యాప్తంగా 648 మంది ఉపాధ్యాయుల మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు జరిగి వారంతా విధుల్లో చేరారు. వైద్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్లు, ఆయుష్ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, వార్డు బాయ్స్, అటెండర్లు కలిపి మొత్తంగా 150 మంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల బదిలీలు మాత్రం జరగడం లేదు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల కోసం ప్రభుత్వం జీవో నంబర్ 317ను జారీచేసింది. నిరుడు డిసెంబర్ ఒకటి నుంచి అదే నెల 31 వరకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు గడువు విధించగా వైద్య, ఆరోగ్య శాఖలోని ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. జనవరిలోనే స్పౌజ్, మెడికల్ ట్రాన్స్‌ఫర్లు చేపట్టినా, మ్యూ చువల్ ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ పెండింగ్‌లోనే ఉన్నది.

**ఉద్యోగుల ప్రదక్షిణలు**

సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకునే నాథుడే లేరని, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌ను కలిసేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నెలరోజుల్లోనే ఆయా శాఖల్లో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ పూర్తిచేశారని, ఇప్పుడు ఆదేశాలివ్వడంలో తాత్సారం చేస్తున్నారని వాపోతున్నారు.

## 'ఆపరేషన్ కగార్'పై స్పందించండి


**ఎన్‌హెచ్‌ఆర్సీకి న్యాయవాది ఫిర్యాదు**

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : 'ఆపరేషన్ కగార్' పేరిట తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లు, మావోయిస్టు హననంపై వెంటనే విచారణ జరపాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లో న్యాయవాది కారుపోతుల రేవంత్ ఫిర్యాదు చేశారు. కర్రెగుట్ట ప్రాంతంలో వేలమంది భద్రత బలగాలు వందల మంది నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేస్తున్నట్టుగా వివిధ పత్రిక కథనాల ఆధారంగా చేసుకుని రేవంత్ ఫిర్యాదు చేశారు.

## కర్రెగుట్టల్లో నిరంతర కూంబింగ్

**అగ్రనేతల ఆచూకీ కోసం తీవ్ర గాలింపు**

ములుగు, మే 1 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టులు స్థావరంగా ఏర్పాటు చేసుకున్న కర్రెగుట్టలలో నిరంతర కూంబింగ్ సాగుతున్నది. అగ్రనేతలే టార్గెట్‌గా 12 రోజులుగా కేంద్ర బలగాలు గాలిస్తున్నాయి. హెలికాప్టర్ల ద్వారా ఏరియల్ సర్వే చేస్తున్నాయి. ఇప్పటికే కర్రెగుట్టల సమీపంలోని నీలంసారాయి కొండను స్వాధీనం చేసుకున్న బలగాలు.. ప్రస్తుతం దోబికొండలో పాగా వేసినట్టు తెలుస్తున్నది. వైమానికదళం హెలికాప్టర్ల నుంచి నేరుగా గుట్టలపైకి దిగుతూ అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నది.



కర్రెగుట్ట వద్ద చక్కర్లు కొడుతున్న హెలికాప్టర్

---

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎంను కలిసిన బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

హైదరాబాద్, మే1 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య డిమాండ్ చేశారు. గురువారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతోకాలంగా మెడికల్, సరెండర్ పెండింగ్ బిల్లులురాక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లోని ఐదు డీఏలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని విన్నవించారు. పీఆర్సీ నివేదికను బహిర్గత పరుస్తూ.. ప్రభుత్వం ఇచ్చిన దానికంటే మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని పేర్కొన్నారు. నిరుడు సిపిక్స్ సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు రెమ్యూనరేషన్ అందించడంతోపాటు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు.

### పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

- పీఆర్‌ఎల్‌ఐలోని నాలుగు రిజర్వాయర్లను 50 టీఎంసీలతో నింపేందుకు చర్యలు : మంత్రి ఉత్తమ్

నాగర్‌కర్నూల్, మే 1 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల ప్రాధాన్యతను గుర్తించి వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని పాలమూరు, ఎంజీకేఎల్ ఎత్తిపోతల పనులను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉత్తమ్ పరిశీలించారు. నార్లాపూర్ రిజర్వాయర్ పంప్‌హౌస్, ప్యాకేజీ-2 ఓపెన్ కెనాల్, ఏదుల రిజర్వాయర్ స్టేజ్-2లోని పంప్‌హౌస్, టన్నెల్, కాల్వ పనులతోపాటు ఎంజీకేఎల్‌ఐని సందర్శించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు మంత్రులకు వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీరు నింపేందుకు ఆర్నెళ్ల సమయం పెట్టుకుని పనులు చేపడతామని అన్నారు.

---

## తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర అమోఘం

- నాయకత్వం వహించిన గౌరవం ఆయనకు దక్కింది
- కులగణనపై స్పష్టత అవసరం
- తెలుగు రాష్ట్రాలపై కేంద్రం వివక్ష
- మీడియా చిట్‌చాట్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ ప్రతినిధి, మే 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలకపాత్ర పోషించారని, రాష్ట్రం కోసం ఆయన చేసిన కృషి అమోఘమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనియాడారు. ఉద్యమకాలంలో కేసీఆర్‌తోపాటు జయశంకర్, కేశవరావు, కోదండరాం తదితరులంతా కలిసి నడిచారంటూ వారందరికీ నాయకత్వం వహించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అందుకే ప్రజలు కేసీఆర్‌కు పదేండ్లు అధికారం కూడా ఇచ్చినట్టు తెలిపారు. గురువారం ఆయన నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్ర సాధన కల సాకారం కావడంలో కేసీఆర్ పాత్ర, ఆయన చేసిన కృషి అభినందనీయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతున్నదని, ఇక్కడ తక్షణమే నియోజకవర్గాల పునర్విభజ న జరపాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీరుతో దేశంలో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలకు ఆస్కారం ఏర్పడుతుందని, ఇది సరైంది కాదని అన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రెండు రాష్ట్రాల బీజేపీ నేతలదేనని స్పష్టం చేశారు. తాజాగా కేంద్ర తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు. రాష్ట్రాలవారీగా ఉన్న కులాల మధ్య తేడాలపై మరింత స్పష్టత ఇవ్వాల్సి ఉన్నదని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్స్ ఉల్లంఘనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉన్నదని పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వను మరో 2మీటర్లు వెడల్పు చేసి లైనింగ్ పనులు చేపడితే ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

## పని చేయించుకుని.. పైసలియ్యని ప్రభుత్వం

- కులగణన ఎన్యుమరేటర్లకు ఇప్పటికీ అందని పారితోషికం
- సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లదీ అదే దుస్థితి
- ఐదు నెలలు గడిచినా పట్టించుకోని అధికారులు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టిన సిబ్బందికి నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పారితోషికం చెల్లించలేదు. రోజువారీ లక్ష్యాలు నిర్దేశించి సర్వే పూర్తిచేసుకున్న సర్కారు.. గౌరవ వేతనం చెల్లించకుండా తాత్సారం చేస్తున్నది. ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు గౌరవ వేతనం కోసం ఐదు నెలలుగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఒకటి రెండు జిల్లాల్లో సిబ్బందికి పారితోషికం అందగా, మిగిలిన జిల్లాల్లో అధికారుల చుట్టూ తిరిగి వేసారిన ఎన్యుమరేటర్లు ఆయా కలెక్టరేట్ల వద్ద నిరసనలు తెలిపారు. కలెక్టర్లకు వినతిపత్రాలు కూడా సమర్పించారు. అయినా, నేటికీ గౌరవ వేతనం దక్కలేదని మండిపడ్డారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం నిరుడు నవంబర్ 6 నుంచి మొదలుపెట్టి ఆ నెలాఖరు వరకు పూర్తి చేసింది. సర్వే సమయంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సమాచారం సేకరించారు.

**కష్టాలకోర్చి డాటా సేకరణ**

కుటుంబ సర్వేలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,16,14,349 ఇండ్లను ఎన్యుమరేటర్లు గుర్తించారు. 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, 10,000 మంది సూపర్‌వైజర్లు పనిచేశారు. ఎన్యుమరేటర్లకు రూ.10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.6వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వరు.

## ఎంపీడీవోలకు వాహన కష్టాలు

- 16నెలలుగా వాహన కిరాయి చెల్లించలేని స్థితిలో రాష్ట్ర సర్కారు
- రేపు, మాపు అంటూ కాలయాపన
- పెండింగ్‌లో రూ.44.18 కోట్లు
- రోజూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- నిధులు కొరత అంటూ సాకులు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ ): రాష్ట్రంలోని మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల (ఎంపీడీవో)ను వాహన కష్టాలు వెక్కిరిస్తున్నాయి. అద్దె ప్రాతిపదికన వారు వినియోగించే వాహన బిల్లులను రేవంత్‌రెడ్డి సర్కారు విడుదల చేయడం లేదు. వారికి నెలవారీగా రూ. 32,300 చొప్పున రావాల్సిన వాహన బిల్లులు గత 15 నెలలుగా రావడం లేదు. దీనిపై ఉన్నతాధికారులను అడిగితే బడ్జెట్ లేదని, రేపిస్తాం.. మాపిస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని తెలంగాణ ఎంపీడీవో అసోయేషన్ నేతలు వాపోతున్నారు. కొన్ని శాఖల్లోని అధికారులకు రెండు నెలలకోసారి వాహన బిల్లులను చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తమ సమస్యలను మాత్రం ఖాతరు చేయ డం లేదని మండిపడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 200మంది మహిళా ఎంపీడీవోలు సహా మొత్తం 570మంది ఎంపీడీవోలు ఉన్నారు. వారంతా మండల స్థాయిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులతోపాటు పలు ఇతర పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అందుకోసం వారికి ప్రభుత్వం అద్దె ప్రాతిపదికన వాహన సౌకర్యం కల్పిస్తున్నది. ఆ వాహనాల కిరాయి కోసం ఒక్కో ఎంపీడీవోకి ప్రభుత్వం ప్రతి నెలా రూ.32,300 చొప్పున చెల్లించాల్సి ఉన్నది. ఈ క్రమంలో 2023 మార్చి వరకు ఎంపీడీవోల వాహన బిల్లులన్నీ నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్లియర్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు వాహన బి ల్లులు క్లియర్ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా ఒక్కసారి కూడా ఎంపీడీవోల వాహన బిల్లులను విడుదల చేయలేదు. అలా నెలకు రూ.1.84 కోట్ల చొప్పున గత 24నెలలకు కలిపి మొత్తం రూ.44.18 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో ఎంపీడీవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సొంత డబ్బు తో వాహన కిరాయిలు చెల్లించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. వాహన బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వాహన బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ ఎంపీడీవోల సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

| | |
|---|---|
| రాష్ట్రంలో మొత్తం ఎంపీడీవోలు | 570 మంది |
| నెలవారీగా ఒక్కో ఎంపీడీవోకు రావాల్సిన వాహన కిరాయి | రూ.32,300 |
| ప్రతినెల ప్రభుత్వం ఇవ్వాల్సింది | రూ.1.84 కోట్లు |
| ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు | రూ.44.18 కోట్లు |

---

### మరో 28 మండలాల్లో 'భూభారతి'

**మంత్రి పొంగులేటి వెల్లడి**

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): మరో 28 మండలాల్లో భూభారతి పైలట్ ప్రాజెక్టును ఈనెల 5నుంచి జిల్లాకు ఒకటి చొప్పున అమలు చేయనున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో విజయవంతంగా భూభారతిని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈనాలుగు మండలాల్లో 72 రెవెన్యూ సదస్సులు కూడా పూర్తి చేసినట్టు వివరించారు. భూసమస్యలపై 11,630 దరఖాస్తులను స్వీకరించినట్టు ఆయన తెలిపారు. భూసమస్యలన్నీ భూభారతితో పరిష్కారమవుతాయని అన్నారు.

### మహిళా వర్సిటీకి 500 కోట్లు మంజూరు

హైదరాబాద్, మే 1(నమస్తేతెలంగాణ): వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 500 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గత మార్చి 8న మహిళా దినోత్సవాల్లో సీఎం హామీ మేరకు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వీసీ సూర్య ధనుంజయ్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

### మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

హైదరాబాద్, మే 1 (నమస్తేతెలంగాణ): మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ 'కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తున్నది విమర్శించారు. కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని అన్నారు.

**పోరాటమే ఏకైక మార్గం**

పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. సకల వర్గాల సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని చెప్పారు.